కథానిక

# కథకురాలి కథనం

యం. జానకీరాణి

శర్మ అటూ యిటూ తిరిగి ఆలస్యంగా వచ్చాడు యింటికి. ఆరాత్రి అతను భోజనం చేయలేదు. సావిత్రి ఎంతో బతిమాలింది. కానీ అతను వినిపించుకోలేదు. సావిత్రికూడా తినలేదు ఆరాత్రి.

డాబామీద మంచాలు వేసివున్నాయి. శర్మ ఆకాశంలోని నక్షత్రాలవంక చూస్తూ నిశ్చలంగా పడుకున్నాడు. అతని మనస్సు కలత పడిపోతోంది. మధ్య మధ్య కోపం ముంచుకొస్తోంది. తనని తాను సంబాళించుకో లేకుండా ప్రతి ఆలోచనకి ఆకులా అల్లాడిపోతోంది శర్మ మనస్సు.

సావిత్రి యివన్నీ గ్రహించలేకపోలేదు. మధ్యాహ్నం శర్మ పత్రిక చదవడం చూసింది. అతని మనోభావాలన్నీ పసికట్టింది. ఆమె యిప్పుడు భయపడుతోంది. ఎలా సమాధానం చెప్పుకోవడమా అని మథనపడుతోంది....

శర్మ సావిత్రిని ఏరికోరి పెళ్లి చేసుకున్నాడు. సావిత్రి అందమైనది, బి. ఏ. చదువుకుంది. ఆదర్శంగా ఏదన్నా ఒకపని చేయాలనుకున్న శర్మ కట్నంలేకుండా సావిత్రిని పెళ్ళాడాడు. సావిత్రి కథలు వ్రాస్తుంది. ఎన్ని పత్రికల్లోనో పడ్డాయి ఆమె కథలు. శర్మ పత్రికలు బాగా చదువుతాడు. కథారచన విషయంలో అతనికి ప్రత్యేకాభిప్రాయం ఏమీ లేదు. ఏ కథైనా అతనికి నచ్చేది. సావిత్రి పేరు నాలుగుమాట్లు పత్రికల్లో చూశాడు. ఆమెకూడా ఒక గొప్ప రచయిత్రే ఐవుండాలి, లేకపోతే యిన్ని కథలు ఎలా పడతాయి అనుకున్నాడు. సావిత్రి చాలా తెలివైందని కూడా అనుకున్నాడు.

పెళ్లయిన కొత్తలో సావిత్రి బొత్తిగా వ్రాయడం మానేసింది.అదో ఆనందంలో, కొత్త అనుభూతుల వెల్లువలో పడిపోయి. ఆతర్వాత రెండు నెలల్లో ఆమె కలం చురుకుగా పనిచేయసాగింది. శర్మ మునుపటికంటే శ్రద్ధగా గమనించసాగాడు సావిత్రి రచనా వ్యాసంగాన్ని.

తన మంచంమీద ఎవరో కూర్చున్నట్టయి వులిక్కిపడ్డాడు శర్మ. మల్లెపూలతో, గాజుల గలగలతో సావిత్రి! అతనిమీదకు వంగి ''ఏమిటా దీర్ఘాలోచన?'' అంది సన్నగా. అతనికి ఆ సౌరభముతో వూపిరి సలపలేదు. ఒక్క నిట్టూర్పు విడిచి, ముఖము తిప్పుకోబోయాడు. కానీ సావిత్రి తన అరచేతులతో అతని ముఖాన్ని పట్టుకుంది.

''చెప్పాలి మరి.,ఎందుకువచ్చింది కోపం?'' అన్నది.

శర్మ గబుక్కున సావిత్రిని తన చేతులతో ముందుకు వంచాడు. ఆమె మెత్తని శరీరము అతని వక్షస్థలముమీద ఆనుతోంది. ''చెప్పు. ఇప్పుడు చెప్పు సావిత్రీ! నిజము నాకు చెప్పు'' అన్నాడు శర్మ ఆవేశముగా. అతని కంఠములో రోదన ధ్వని వున్నది.

సావిత్రి అడ్డముగా తలూపింది ''చెప్పను- ఏమిటీ చెప్పేది?'' అన్నది సాగతీసుకుంటూ.

శర్మ తన కళ్ళతో సావిత్రిని నమిలి మింగి వేసేలా చూస్తున్నాడు. ''ఆ రాత్రి ప్రభాకరం ఎక్కడ పడుకున్నాడు?''....

పెళ్లయిన కొత్తలో, ఒకనాడు-సావిత్రి పడక్కుర్చీలో కూచుని వ్రాసుకుంటోంది. రేడియో సన్నగా పాడుతోంది. శర్మ ఎదురుగా సోఫాలో కూచుని, వాలివున్న సావిత్రి కళ్ళవేపు తదేకముగా చూస్తున్నాడు. సావిత్రి కళ్లు, నుదురు వంకుల జుట్టు\ అన్నీ సన్నిహితమే శర్మకి. కానీ యీ సావిత్రేనా యింత గొప్పగా వ్రాసేది అనిపించింది. అదేదో లోకములో వున్నట్లు ఉంటుంది. సావిత్రి ముఖం చూస్తే, ముదురు నీలం చీరెకి ప్రతిగా మెరుస్తోంది సావిత్రి ఒళ్ళు.

శర్మ సోఫాలోంచి లేచివెళ్ళి సావిత్రి వెన

కాల నిల్చున్నాడు. సావిత్రి ఇతని కదల కను గమనించి చిన్నగా నవ్వింది రాస్తూనే. వాక్యము పూర్తిచేసి, మెడ వెనక్కివంచి శర్మ వంక చూసింది.

''ఏమిటి చూస్తున్నారు?'' అన్నది.

శర్మ తన అరచేతుల్లోకి తీసుకున్నాడు సావిత్రి ముఖాన్ని. ''ఈ చిన్నారి సావిత్రేనా యింత విప్లవాత్మకంగా కథలు వ్రాసేది అని చూస్తున్నాను'' అన్నాడు.

సావిత్రి తియ్యగా నవ్వింది. ''ఉహూ!'' అంది వెక్కిరింతగా. శర్మ ఆమె ఎదురుగావచ్చి నించున్నాడు. ''ఎల్లా వస్తాయి నీకు యిన్ని ఆలోచనలు?'' అన్నాడు అమాయికంగా.

సావిత్రి మళ్లీ నవ్వింది. ''ఎల్లా ఏమిటి? కళ్లు తెరుచుకుని మనుష్యులని చూస్తూంటే సరి'' అన్నది.

''మరి నేనూ చూస్తున్నానుగా? నేను రాయలేనేం?''

''ఎందుకు వ్రాయలేరూ? మొదలెట్టండి. అదే వస్తుంది'' అన్నది సావిత్రి కలము మూసేసి.

శర్మ వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. ''అది కాదుగానీ సావిత్రీ, నాకో సంగతి చెప్పు. ఏదో విధంగా నువ్వు అనుభవిస్తేనేకానీ ఏదీ వ్రాయ లేవు కాదూ? అంతే....నాకు చేతకావటము లేదు చెప్పడము'' అన్నాడతను.

సావిత్రి లేచివచ్చి అతనిప్రక్కన కూర్చుంది. ''నా కథల్లో సంఘటనలు కొన్ని విన్నవి, కొన్ని చూసినవి—మరికొన్ని స్వయంగా అనుభ వించినవి. ఆవేశాలు, మమతలు అన్నీ అను భవిస్తాను రాసే ముందు'' అన్నదామె.

శర్మకి ఏదో కొరతగా వుంది యింకా. ''అంటే నీకు వ్యక్తిగతంగా సంబంధించినవి కూడా వ్రాయగలవా?'' అన్నాడతను.

సావిత్రి లేచింది. ''కొన్ని అల్లాంటివీ వుంటాయి. పదండి కాఫీ తీసుకుందురుగాని'' అని లోపలకు వెళ్ళిందామె.

శర్మ చాలాసేపు అల్లాగే ఆలోచిస్తూ కూర్చు న్నాడు. అతని మనస్సులో ఛాయామాత్రంగా ఒక యోచన కలిగింది. 'రచయితలు తాము స్వయంగా అనుభవించినవే బాగావ్రాయగలరు అనుకున్నాడతను. శక్తివున్నా స్వీయానుభవం వుంటేనే రచన సహజంగా వుంటుంది అని పించిందతనికి. అంతేకాదు రచయితలంతా స్వానుభవాలే వ్రాస్తారు అని కూడా నిర్ణయించు కున్నాడు. కొంచెం బాధాకరంగా వున్నా ఎంత సేపటికోగానీ యీ యోచన చెరగిపోలేదు.

ఒక సాయంకాలం శర్మ తన ఆఫీసర్లతో కలిసి సినిమా కెళ్ళాడు. అదేసమయంలో సావిత్రిని చూడడానికి ఆమె చిన్ననాటి స్నేహి తురాలు శచి మద్రాసునుంచి వచ్చింది ఆమె సావిత్రి చిరునామా పత్రికల వారి దగ్గ ర్నుంచితీసుకున్నానని చెప్పింది. సావిత్రిపెళ్లి యిన తర్వాత యిదే తొలిసారి స్నేహితు లిద్దరూ కలవడం.

ఎన్నో పాతగాథలు తవ్వుకున్నారు స్నేహి తులు. భోజనాల తర్వాత పడక గదిలోకి తీసుకు వెళ్ళింది శచిని. ఆ గదిలో బల్లమీద సావిత్రి శర్మ కలిసి తీయించుకున్న ఫోటో వుంది. గదిలోకి వెడుతూనే చటుక్కున ఆ ఫోటోని తీసుకుని చూసింది శచి. ఆమె తదే కంగా దానివంక చూస్తూంటే, సావిత్రి చిరు నవ్వు నవ్వింది.

''ఏం శచీ, ఏం మారాను నేను అప్పటికీ యిప్పటికీ?'' అన్నది. కానీ శచి పరధ్యానంగా వున్నది. సమాధానం చెప్పలేదు. మిత్రురాలి పెళ్ళి ఫోటో చూసిన ఆనందంలేదు ఆమె వద నంలో ఫోటో పుచ్చుకున్న ఆమె వ్రేళ్లు వణుకు తున్నాయా అనిపించింది సావిత్రికే. శచికళ్లు కూడా విచిత్రంగా ఆ ఫోటోలో దేనికోసమో వెతుకుతున్నాయి. సందేహం, విషాదం, భయం ఎన్నోస్ఫురించాయి ఆ కళ్ళల్లో సావిత్రికి.

చటుక్కున శచి భుజంమీద చేయివేసింది సావిత్రి. ''ఏమిటి శచి? ఏమిటలా విచిత్రంగా మారిపోయావు?'' అన్నదామె ఆశ్చర్యంగా.

శచి వులిక్కిపడింది ఒక్కసారి. మరుక్షణం తేరుకుని, వణికే వ్రేళ్ళతోనే ఆ ఫోటోని బల్ల మీద వుంచేసి, మంచంమీద కూర్చుంది— వాలిపోయింది.

"ఏమీలేదు. ఏదో జ్ఞాపకమొచ్చి....ఎక్కడో చూసినట్టుగా వుంటేను" అన్నది మెల్లిగా. ఆమె కంఠంలో జీవంలేదు.

"కాదు, ఇంకేదో ఉన్నది. నీకేదో భయంకరమైన సంఘటన జ్ఞాపక మొచ్చింది. చెప్పాలి అన్నది సావిత్రి. శచి ఏమీలేదని సవరించుకో బోయింది. కాని సావిత్రి అంత తేలిగ్గా నమ్మేమనిషి కాదు. బలవంతపరచింది శచిని చెప్పమని—

శచిచెప్పింది ఒక గాధవి—రెండేళ్ళనాటి ఒక గాధని. అంతా విన్నతర్వాత సావిత్రి మాట్లాడలేదు. ఏడ్చిగోల చేయలేదు' మూర్ఛ పోలేదు. ఒక్కనిట్టూర్పు విడిచింది.

కాస్సేపటికి తలయెత్తి శచివంక చూసింది. శచి తల వంచుకుంది. "చెప్పకూడదను కున్నాను సావిత్రీ...." అన్న దామె.

"లేదుశచీ, నువ్వు చెప్పడం చాలా మంచి పని. నేనుకూడా తెలుసుకోవడం అవసరమే.... బాధపడకు శచీ" అన్నది ఆమె.

గడియారం తొమ్మిదికొట్టింది. శచి వెళ్ళిపోతానంది. సావిత్రి బలవంత పెట్టలేదు. శచి వెళ్ళిపోయింది. సావిత్రి మిగిలింది—కలతపడిన మనస్సుతో, పరిపరివిధాలపోతున్న ఆలోచనలతో.

* * *

శర్మ స్నేహితులు చాలామంది యింటికి వస్తుంటారు. సావిత్రి చదువుకున్నది కావడాన వారి సంభాషణాల్లో తనూ పాల్గొనేది.

ఒకనాడు శర్మ స్నేహితుడు ప్రభాకరం బెంగుళూరునుంచి వచ్చాడు. అతనికి ఏర్ ఫోర్సులో పని, చాలా పెద్దజీతం తెచ్చుకుంటు న్నాడు. శర్మ, అతను ఇంటరువరకు క్లాసు మేట్సు. ఎన్ని సంవత్సరాలైనా తగ్గనిది వారి స్నేహభావం. బెజవాడ మీదుగా వెడుతూ శర్మని చూసిపోదామని వచ్చాడతను,

సావిత్రిమీద చెప్పలేని అభిమానం కనుపర్చా డతను. ప్రభాకరం రచయిత కాక పోయినా, శర్మకంటే సాహిత్యాన్ని గురించి ఎక్కువగా తెలిసినవాడు. సావిత్రికి అతనితో మాట్లాడేందుకు చాలావిషయాలే వచ్చాయి.

రాత్రి భోజనంచేసి కూర్చున్నారు డాబా మీద. ఆరాత్రి సావిత్రి ప్రత్యేకంగా అందంగా కనుపించింది శర్మ కళ్ళకి. సిగరెట్ కాలుస్తూ ఆలోచనలో మునిగిపోయాడు శర్మ. ప్రభాకరం సావిత్రితో మాట్లాడుతున్నాడు ఏవో కావ్యాలని గురించి. ఆవలింతలొచ్చాయి సావిత్రికి.

"టైమెంతయిందండీ" అనడిగింది శర్మని. గడియారం వంక చూసి "తొమ్మిది ఇరవై" అన్నాడతను.

ఇంతలోనే క్రింద తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. సావిత్రి కిందికివెళ్ళి ఐదు నిముషాల్లో తిరిగి వచ్చింది.

"టెలిగ్రాం. మీ మామయ్యగారికి చాలా సీరియస్‌గా వుందిట. బయలుదేరి రమ్మని మీ నాన్నగారిచ్చారు." అని ఎఱ్ఱకాగితం అందించింది.

శర్మ చివాలునలేచి కూర్చున్నాడు. మేనమామంటే చాలా అభిమానం శర్మకి. అతని గుండెలు ఝల్లుమన్నాయి. "ఆ ఏదీ?" అంటూ అతను గాభరాగా చదివాడు టెలిగ్రాం గడియారం చూసుకున్నాడు ఓమాటు. "రాజమండ్రి బండి 10-25కి నేను వెళ్ళాలి సావిత్రీ పద బెడ్డింగు తియ్యి." అంటూ లేచి, గబగబ మెట్లమీదికి వచ్చాడు.

సావిత్రి నిరుత్తరంగా నిల్చుంది. తటపటాయిస్తూ, "నేనూ వస్తాను." అన్నది. శర్మ మాట్లాడలేదు. సావిత్రి అతన్ని అనుసరిస్తూ. "ఏమండీ?" అన్నది. "ఒద్దు. అక్కడ పరిస్థితి ఎల్లా వుందో, నువ్వు మీ బాబాయిగారింటికి వెళ్ళు రేపు ప్రొద్దున్నే నేను వుత్తరం వ్రాస్తాను," అన్నాడతను.

సావిత్రికూడా కిందికి దిగి వచ్చింది. గదిలోకి అతనివెంటే వెళ్లి పంచెలు, చొక్కాలు తీసింది. "చూడండి, మరి ప్రభాకరం...." ఏమనాలో తోచక ఆగిపోయింది.

శర్మ హడావిడిగా షేవింగుసెట్టు సంచిలో వడేశాడు. "ఉంటాడు ఫర్వాలేదు. ఈరాత్రికి యిక్కడే వుండు. అతను తెల్లారి వెడతాడు." నిస్సంకోచంగా అనేసి బెడ్డింగు చుట్టేశాడు శర్మ. కానీ సావిత్రికి సంకోచంగానే వుంది.

"ఒద్దండీ-నేనూ వస్తాను." అందిగారంగా. శర్మ ఒక్కనిమిషం సావిత్రివంక చూశాడు. ఆమె బుజాలమీద చేతులువేసి నవ్వాడు. "చూడు సావిత్రీ, పేచీపెట్టకు. నేను ఉత్తరం వ్రాయనూ?" అన్నాడు.

ప్రభాకరంకూడా క్రిందికి దిగివచ్చాడు. "ఏమోయి. నువ్వు తొందరగా బయలుదేరాలి మరి. నేనుకూడా వస్తానుపద" అన్నాడతను.

శర్మ వినుపించుకోలేదు. బైట వరండాలోకి వచ్చిన తర్వాత "నువ్వుండు ప్రభాకరం. ప్రొద్దున్నే వెడుదెవుగాని సావిత్రీ ఒక్కత్తీ వుండలేదు" అంటూనే రిక్షాలో పడ్డాడు.

♦ ♦ ♦

శర్మ మేనమామపోయాడు. సావిత్రి రాజమండ్రి వెళ్ళలేదు, పదిరోజుల తర్వాత బెజవాడ తిరిగి వచ్చాడు శర్మ తానల్లా హఠాత్తుగా వెళ్ళిపోయి నందుకు క్షమాపణలు తెల్పుతూ వుత్తరం వ్రాశాడు ప్రభాకరానికి.

ఆ తర్వాత పదిహేనురోజులకి వార పత్రికలో సావిత్రి కథ "ఒకరేయి పొరబాటు" పడింది. పెళ్ళి ఐనతర్వాత యిదివరకు కంటే సావిత్రి కథలు శ్రద్ధగా చదువుతున్నాడుశర్మ. మధ్యాహ్నం పత్రిక రాగానే సావిత్రి పేరు చూశాడు ఆనాడు సావిత్రితో కథలని గురించి మాట్లాడిన తర్వాత యిదేకథ సావిత్రి వ్రాసింది. ఆనాటి సంభాషణ అంతా ఒక్కసారి శర్మ మనస్సులో మెదిలింది. స్వానుభవాలైతేనే సొంపుగా వ్రాయగలరు రచయితలు అనుకున్నాడు తను ఆ రోజు....

సావిత్రికథ చదవడం ప్రారంభించాడు శర్మ. ఒక యువకుడు తన స్నేహితుణ్ణి చూడటానికి వెడతాడు. ఆ స్నేహితుడి భార్య సౌందర్యానికి యితడు ముగ్ధుడౌతాడు. దురదృష్టవశాత్తు ఆ మిత్రుడు అర్జంటుపనిమీద ఆరాత్రి ఎక్కడికో వెళ్ళాల్సివస్తుంది. ఆ యువకుడు అవకాశం వృథాపోనివ్వకుండా ఆమె మీదపడి బ్రతిమాలుతాడు, ఏడుస్తాడు. ఆమెకూడా చలిస్తుంది, తనని తానర్పించుకుంటుంది. అదంతా 'ఒకరేయి జరిగిన పొరపాటు-' ఇదీకథ.

పూర్తయ్యేసరికి, శర్మ మనస్థితి యిదమిత్థమని తేల్చి చెప్పేట్టుగాలేదు. అర్థంకాని బాధ కెరటాలుగా పైకి లేస్తోంది, కుంగిపోతోంది.

ఆరాత్రి—తను రాజమండ్రి వెళ్ళిన రాత్రి, ప్రభాకరం, సావిత్రి మాత్రమే వున్నారింట్లో. అప్పుడు తనకేమీ సంకోచము కలుగలేదు. కానీ—యిదంతా ఏమిటి? ఈ కదంతా పూర్తిగా కల్పితమేనా? కానేరదు. ఆ యువకుని వర్ణన 'తు. చ.' తప్పకుండా ప్రభాకరానికి సరిపోయింది. రిమ్‌లెస్ కళ్లజోడు, పొందూరు పంచె, పైగా 'మనోరంజితం' వాసన—అంతా అతనే. సందేహములేదు.

సావిత్రి—హూ! సావిత్రి! అనుకున్నాడు కోపంగా శర్మ. అతని కళ్లు జేవురించాయి. తనతో ముఖాముఖి చెప్పకునే ధైర్యములేక యిల్లా వ్రాసింది. కానీ చిన్ననాటి స్నేహితుడు ప్రభాకరంకూడా యిలా ప్రవర్తిస్తాడా? తనకే ద్రోహం తలపెడతాడా ఏమో, ఎవరు చెప్పగలరు? ఆడవాళ్ళ అందం ఎంతపనైనా చేయిస్తుంది. సావిత్రి ఆ రాత్రి తనకళ్లకే అందంగా కనుపించలేదూ? ప్రభాకరం చూపుల్లోనేవుంది ఆ మైకం. తనకి ఆనాడు స్ఫురించలేదుకానీ.

అంతా అర్థం చేసుకున్నాడు శర్మ. సావిత్రి దగ్గర్నించి సత్యాన్ని రాబట్టాలి. అందుకే సూటిగా ప్రశ్నించాడు....

........"ఆరాత్రి ప్రభాకరం ఎక్కడ పడుకున్నాడు?" అన్నాడు శర్మ. సావిత్రి వెంటనే మాట్లాడలేదు. ఊపిరి బిగబట్టింది. "మీరు విడిచిపెట్టివెళ్ళిన చోటే" అన్నది.

శర్మకి అర్థంకాలేదు యీ సమాధానం. సావిత్రి కళ్ళల్లోకి తీవ్రంగా చూశాడతను. ఆమె బుజాలు నెప్పి పుట్టేట్టుగా అదుముతున్నాయి అతని చేతులు. "కాదు. చెప్పు" అన్నాడు.

సావిత్రి బలవంతంగా విడిపించుకుంది అతన్నిపట్టుని. "ఏమిటండీ చెప్పేది?" అన్నది.

"నీకథకి అర్థం. నీప్రవర్తనకి వ్యాఖ్యానం" అన్నాడు శర్మ గట్టిగా.

సావిత్రి తమాషాగా నవ్వింది. "ఓహ్! అదా? ఏముందీ, ఇమాజనేషన్!"

"కాదు. నిజమున్నది. ఆ వర్ణన అంతా అతనిదే. నేను వెళ్ళిపోయిన తర్వాత అతనిల్లాగే

ప్రవర్తించి వుంటాడు. నువ్వు....నువ్వు కూడా పశువ్వి." గబగబా అనేశాడీమాటలు శర్మ. అతని వేళ్లు గట్టిగా జుట్టుని పీక్కున్నాయి.

సావిత్రి మళ్ళీనవ్వింది మ ధు ర ం గా "చూడండి. కథంతా నిజమేగానీండి...."

శర్మ చటుక్కున లేచికూచున్నాడు. "నిజ మేనా? అంతా నిజమేనా సావిత్రీ?" అతని పళ్లు పటపట లాడాయి.

"కానీ-కథానాయకురాల్ని నేనుకాదు.శచి!"

శర్మ ఆ పేరు విని, పాలిపోయి, నీరసించి మంచంమీదను వాలిపోవడానికి రెండు నిము షాలు పట్టింది. "శచి!" అని రహస్యంగా అనుకున్నాడతను.

సావిత్రి యింక ఆపుకోలేదు, "చూడండి, మాకథల్లో అన్నీ స్వానుభావాలే వుంటాయని మీరనుకుంటారు. అనుకున్నారు. నన్ను అడి గారుకూడాను. కథల్లోవ్రాసిన సంఘటనలకి సమానాంతరంగా జీవితంలో ఏమన్నా ఉందేమో నని వెతుకుతారు మీరు. ఏమివ్రాసినా అనుమా నిస్తారు. ఇది మొదటిసారికాదు మీరిల్లాఅనుమా నించడం. కాని సహించి ఊరుకోవడమే నావంతు. శచి నా ప్రాణస్నేహితురాలు. మీరు సినిమాకి వెళ్ళా రొకనాడు. అప్పుడు వచ్చింది ఆమె. రెండేళ్ళక్రిం మద్రాసు రావడం, శచి భర్త రామారావు సెక్రటేరియేటులో రాత్రి ప్రొద్దుపోయేవరకు వుండవలసి రావడం—అన్నీ చెప్పింది. మీచూపులు బాధించాయి ఆమెని ఉదయంనుంచి. ఇంట్లో వుండడం ప్రమాదకరమనీ ఆమె బయటకు బయలు దేరింది. మీర్వూవెన్నాడారు ఆమెని బీచీవరకు. అక్కడ తెల్లని యిసుకలో, చల్లగాలిలో, సముద్రఘోషలో మీ మనస్సు విప్పుకున్నారు ఆమెముందు. శచి ఆవేశ పూరితరాలు. ఆ తర్వాత—ఇంకేముంది? శచీంద్రుడు లైనారు." సావిత్రి వ్యంగ్యంగా నవ్వింది. కొంగుతీసి కళ్ల కడ్డంగా పెట్టుకుని కూచుందామె.

పదివిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఆ నిశ్శబ్దతలో శర్మ ఉచ్ఛ్వాసనిశ్వాసాలుమాత్రం స్పష్టంగా వినిపిస్తున్నాయి. అతని హృదయం చేసే ప్రతిస్పందన అర్థమౌతోంది సావిత్రికి.

"సావిత్రీ!" నూతిలోంచి వచ్చినట్లుగా శర్మగొంతు.

"ఊ" అంది సావిత్రి మెల్లిగా. ఆమెకంఠం తడిగాఉంది. లోపల్నుంచి వుబికివచ్చే ఆవే శాన్ని ఆపుకుంటోం దామె. తనమీద తనకే జాలివేస్తోంది.

"చూడు సావిత్రీ, నన్ను క్షమించావా యిదంతా విన్నాక?"

"క్షమించక చేసేదేముంది? నేనీసంగతి తెలుసుకుని రెండునెలలైంది. బాధపడ్డాను. ఎన్నివిధాలో తపన ననుభవించాను. కానీ సమాధాన పరచుకున్నాను. ఆవేశం—అందు లోనూ మగవాళ్ళలో కలిగే ఆవేశం ఎల్లాం టిదో వూహించు కున్నాను, ఆ పరిస్థితులు, ఆ వాతావరణం కల్పిస్తే,* దాన్ని తట్టుకోవ డానికి చాలా ఆత్మశక్తి కావాలి. నాలో వుండే సృజనశక్తి నన్నూరుకో నివ్వలేదు. కానీ వున్నదున్నట్లుగా వ్రాస్తే మీరు బాధ పడ తారు. కసిగా వ్రాశానంటారు. జీవితాంతం యీ అభాండం తప్పదు నా మీద. అందుకు ప్రభాకరం వచ్చాడు కథలోకి. నిజానికి మీకు మీకదే జ్ఞాపకానికి రావలసింది. కానీ ప్రభాకరం వర్ణనతోనే మీ మెదడు వేడెక్కింది. వేరొక దెసకు పోలేదు మీ ఆలోచనలు. నేను యిన్నాళ్లూ మనస్సులోనే మథనపడ్డాను. ఒక్క మాట కూడా అనలేదు. ఎంతగా కుమిలి పోయాను...." సావిత్రి మాట్లాడలేకపోయింది. ఆమె కంఠం రుద్ధమైంది.

శర్మలేచి సావిత్రిని దగ్గరకు తీసుకున్నాడు.

"సావిత్రీ నువ్వు దేవతవి—నిజంగా నేను శచిని ప్రేమించానని అనుకుంటున్నావా?"

సావిత్రి ఒక నిముషమూరుకుని "లేదు. అన్నది. "కానీ—కానీ—నేను వ్రాసేకథల్లో అన్నీ స్వానుభవాలే అనుకోవడం మానేయండేం? అసలు ఆ దృష్టితో అనుమానంతో చూడడమే."

"మానేస్తాను, అంతేకాదు. నీ కథలు చదివి సంఘటనలకోసం నా జీవితంలో వెతుక్కోవడ మారంభిస్తాను" అంటూ ఆమె తల్లో పూలు ఆఘ్రాణించాడు శర్మ. ★